సాక్షి
రంగారెడ్డి
ఆదివారం : 11 : ఫిబ్రవరి : 2024



ఫోర్జరీ చేసి.. ప్లాట్లు అమ్మి

ఉద్యోగం చేస్తున్న సంస్థను మోసం చేశారు.. ఫోర్జరీ సంతకాలతో ప్లాట్లను విక్రయించారు.. ఎట్టకేలకు ఒక్కడు చిక్కాడు. 8లో▸



క్రీడాకారులకు తగిన గుర్తింపు

యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభకు గుర్తింపు తేవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని మాజీ ఎంపీ కొండా పేర్కొన్నారు. 8లో▸



సమ్మెకు సహకరించాలి

ఈ నెల 16న చేపట్టే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ కోరారు. 8లో▸

న్యూస్‌రీల్

రోడ్డు భద్రతపై అవగాహన



తుర్కయంజాల్: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు ఉషశ్రీ, అనూష తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం ప్రాంతీయ రవాణాశాఖ అధికారి ఎం.రఘునందన్ గౌడ్ ఆదేశాల మేరకు శనివారం సాగర్ రహదారిపై రోడ్డు భద్రత గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కారులో ప్రయాణించే సమయంలో సీటు బెల్టు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే సమయంలో హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారికి గులాబీ పూలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీఏ కార్యాలయ సిబ్బంది బాలకృష్ణ, శివప్రసాద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం ఆలోచించాలి



విజేతలతో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ రావు తదితరులు

తుర్కయంజాల్: మన జీవితం పంచభూతాల ఆధీనంలో ఉంటుందని.. నేల, నీరు, గాలి కాలుష్యమై పోతూ కొత్త వ్యాధులు పుట్టుకువస్తున్నాయని జిల్లా హరితదళ సమన్వయకర్త, జిల్లా సైన్స్ అధికారి వై.శ్రీనివాస్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర జాతీయ హరిత దళ విభాగం ఆధ్వర్యంలో పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని వశిష్ట మోడల్ స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన 'ప్లాస్టిక్ వాడకం మానేద్దాం..ప్రకృతితో మమేకమై జీవిద్దాం' అంటూ డ్రామా, ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ భూతం అన్నింటినీ కలుషితం చేస్తోందని, రేపటితరం బాగుండాలంటే ఒక్కసారి వాడి పడేసే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం ఆలోచించాలని.. ఆదిశగా విద్యార్థులు, తల్లిదండ్రులు చైతన్యం కావాలని పేర్కొన్నారు. జిల్లాలోని 21 పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు ప్రదర్శించిన పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు ఎం.మురళీ మోహనాచారి, వశిష్ట స్కూల్ కరస్పాండెంట్ మీనేందర్ రావు, ప్రిన్సిపాల్ మమత తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేయండి

- బిల్డర్లకు రెరా సభ్యుడు శ్రీనివాస్ సూచన

సాక్షి, సిటీబ్యూరో: నగరవాసుల సొంతింటి కలను సాకారం చేసేందుకు హైటెక్ సిటీలోని మేదాస్ ఎక్స్ పో సెంటర్లో 'రూఫ్ అండ్ ఫ్లోర్.కామ్' ప్రాపర్టీ షో శనివారం ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజుల ఈ షోను తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీఎస్-రెరా) సభ్యుడు కె.శ్రీనివాస రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేయడం లేదనే ఫిర్యాదులు కస్టమర్ల దగ్గరి నుంచి బాగా వస్తున్నాయని అన్నారు. దీంతో కస్టమర్లకు ఇంటి అద్దెతో పాటు బ్యాంకు నెలవారీ వాయిదాలూ (ఈఎంఐ) చెల్లించాల్సి వస్తుందని, ఇది వారికి అదనపు భారంగా మారుతుందని చెప్పారు. అందుకే బిల్డర్లు కొనుగోలుదారులకు ఇచ్చిన గడువులోగా ప్రాజెక్టులను నిర్మించాలని సూచించారు. సుమారు రెండు వందలకు పైగా నిర్మాణ సంస్థలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి.

సర్టిఫికెట్ల పరిశీలనకు మరో అవకాశం

వికారాబాద్ అర్బన్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల్లో డీఈఈసెట్ 2023 –25 రెండు సంవత్సరాల కోర్సులో చేరడానికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కాని వారి కోసం ఈ నెల 14న మరోసారి అవకాశం కల్పించినట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాలలో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. ఈ నెల 15 నుంచి 17 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. 22న సీట్ల కేటాయింపు, 23నుంచి 26వ తేదీ వరకు ఫీజు చెల్లించి అలాట్‌మెంట్ లెటర్ పొందొచ్చని సూచించారు. ఎంపికైన కళాశాలలో ఒరిజినల్ ధ్రువపత్రాలను సమర్పించి 28వ తేదీలోగా జాయిన్ కావాలని సూచించారు.

సంక్షేమం గ్యారంటీ

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

- బాగుందన్న అధికార పార్టీ నేతలు
- నిస్సారమన్న ప్రతిపక్ష నాయకులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శనివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని.. సంక్షేమం 'గ్యారంటీ' అని అధికార కాంగ్రెస్ కొనియాడుతుండగా.. పేదల ఆశలపై నీళ్లు చల్లేలా ఉందని ప్రతిపక్ష బీఆర్ఎస్ విమర్శనాస్త్రాలు సంధిస్తోంది. సంక్షేమానికి పెద్దపీట వేసిందని.. పేద ప్రజలకు ఉపయోగపడేలా ఉందని.. హస్తం పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్ నిస్సారంగా ఉందని.. అన్ని వర్గాలను మోసం చేసేలా ఉందని.. రైతుబంధుపై ఆంక్షలు విధించడం అన్యాయమని ప్రతిపక్షనేతలు పెదవి విరుస్తున్నారు.

సాగు భూమికే రైతు భరోసా

గత ప్రభుత్వం సాగుకు యోగ్యంగా లేని వ్యవసాయేతర భూములకు సైతం రైతు బంధు చెల్లించింది. జిల్లా వ్యాప్తంగా లక్షలకుపైగా ఎకరాల భూములు ఉండగా, వీటిలో 5 లక్షల ఎకరాలకు మించి సాగులో లేవు. జిల్లా వ్యాప్తంగా 4,04,436 మంది రైతులు రైతుబంధు సాయం కోసం పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరికి రూ.376.92 కోట్లు జమ చేయాల్సి ఉంది. వీరిలో సాగురైతులతో పాటు ఎన్ఆర్ఐలు, ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సినీ ప్రముఖులు, ఇతర వ్యాపారులు కూడా ఉన్నారు. ఇక నుంచి వ్యవసాయం చేసే అసలైన రైతులకే రైతు భరోసా పథకం కింద ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

ప్రత్యేక జోన్లు, పారిశ్రామిక క్లస్టర్లు

పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా జిల్లాను మూడు భాగాలుగా విభజించనున్నట్లు తెలిపింది. ఇన్నర్‌రింగ్‌రోడ్డు, అవుటర్ రింగ్‌రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు ఇలా మూడు జోన్లుగా విభజించి, ఆయా ప్రాంతాల్లోని మున్సిపాలిటీలు, గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొంది. జిల్లాలోని మెజార్టీ ప్రాంతాలు రీజినల్ రింగ్ రోడ్డు లోపలే ఉన్నాయి. పరిశ్రమలకు ప్రోత్సాహం, భూసేకరణలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ఒకే చోట పరిశ్రమలు నెలకొల్పకుండా ప్రభుత్వ భూములు ఎక్కువ అందుబాటులో ఉన్న ప్రాంతాలను ప్రత్యేక క్లస్టర్లుగా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. తద్వారా రైతులు భూములు కోల్పోకుండా చూడొచ్చని..ఒక్కో జోన్‌లో ఒక్కో రంగానికి సంబంధించిన పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా కాలుష్య భూతం నుంచి పర్యావరణాన్ని పరిరక్షించొచ్చని..ఆయా ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించొచ్చని భావిస్తోంది.

పేదల ఆరోగ్యానికి భరోసా

జిల్లాలో 35 లక్షలకుపైగా ఓటర్లు ఉండగా, వీరిలో తెల్లరేషన్‌కార్డు కలిగిన పేదలు 18,25,128 మంది ఉన్నారు. ఖరీదైన ఆస్పత్రుల్లోనూ వీరంతా ఆరోగ్య శ్రీ పథకం కింద పైసా ఖర్చు లేకుండా ఉచితంగా వైద్య సేవలు పొందే అవకాశం కల్పించింది. జిల్లా లోని ఆయా నెట్‌వర్క్ ఆస్పత్రులకు గత ప్రభుత్వం భారీగా బిల్లులు బకాయి పడింది. ఈ బిల్లులను కూడా చెల్లించనున్నట్లు ప్రకటించడంతో చికిత్సలు చేసి ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న ఆస్పత్రి యాజమాన్యాల నిరీక్షణ ఫలించనుంది.

ఆ ఇళ్లకు 'ఉచిత' వెలుగులు

గృహజ్యోతి పథకం కింద నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారికి ఇక నుంచి ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తింపజేయాలని సర్కార్ నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 15,98,206 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే వారు 5,58,664 మంది ఉన్నట్లు అంచనా. ఈ పథకం ద్వారా వీరందరికీ లబ్ధి చేకూరనుంది. జిల్లాలో అంత్యోదయ కార్డులు 34,738 ఉండగా, ఆహార భద్రత కార్డులు 5,23,886 ఉన్నాయి. అన్నపూర్ణ కార్డులు మరో 40 వరకు ఉన్నాయి. వీరందరికీ రూ.500కే గ్యాస్ సరఫరా చేయనుంది. ఇప్పటికే ఆయా విభాగాల సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు.

అంతా అంకెల గారడీ



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ అంకెల గారడీని తలపిస్తోంది. ఆరు గ్యారంటీల అమలుకు ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదు. రైతు రుణమాఫీ అంశాన్ని ప్రస్తావించలేదు. నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదు. మహిళకు ఉచితంగా బస్సు ప్రయాణం అన్నారు కానీ సమయానికి బస్సులే రావడం లేదు. జిల్లాలో కొన్ని గ్రామాల్లో బస్సు సౌకర్యం లేదు. ఎంతోమంది యువత ఉద్యోగాల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది. 24 గంటల కరెంటేమో కానీ గ్రామాల్లో కరెంట్ కోత అమలవుతోంది.

– బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

సంక్షేమానికి సూచిక



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల సంక్షేమాభివృద్ధికి సూచిక. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు పరిచేందుకు నిధుల కేటాయింపులు జరిగాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు. విద్యారంగానికి అధిక నిధులతో విద్యార్థులు, యువతకు భరోసా కల్పించింది. అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్ ఇది.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

అన్ని వర్గాలకు న్యాయం



కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవమైన అంకెలతో ప్రజల ముందు బడ్జెట్ ప్రవేశపెట్టింది. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసింది. అన్ని వర్గాల వారికి న్యాయం చేసేలా నిధులు కేటాయించింది. అన్నం పెట్టే రైతులకు అండగా నిలిచేలా ఉంది. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుంది. రెవెన్యూ, విద్య, వైద్యం, ఆరు గ్యారంటీలు, పురపాలక, పరిశ్రమలు, పంచాయతీ, గ్రామీణాభివృద్ధికి ప్రత్యేకంగా దృష్టి సారించింది.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

నిస్సారమైన బడ్జెట్



అన్నివర్గాలను మోసం చేసేలా నిస్సారమైన బడ్జెట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆరు గ్యారంటీలతోపాటు మేనిఫెస్టోలో ప్రజకిచ్చిన అనేక హామీలను తుంగలో తొక్కినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. రైతు సంక్షేమం ఇబ్బందికరంగా మారింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలకు నిధులు తగ్గించారు. అంబేద్కర్ అభయ హస్తం కింద దళితులకు 12 లక్షలు ఇస్తామని చెప్పి ఊసే ఎత్తలేదు.

– మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

దివ్యాంగుల ప్రస్తావన ఏదీ?



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో దివ్యాంగుల ప్రస్తావన లేదు. రాష్ట్రంలో ఉన్న 40 లక్షల మంది దివ్యాంగుల సంక్షేమాన్ని గాలికి వదిలేసింది. ఒక్క పైసా కూడా కేటాయించలేదు. డిసెంబర్ నుంచి ఆసరా పెన్షన్లు పెంచుతామని చెప్పారు.. నిధులు కేటాయించకుండా ఎలా పెంచుతారు..? అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని ఎలా అందిస్తారు..?

– జేర్కొని రాజు, దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి

పేరుకే రాచకొండ కమిషనరేట్

- సొంత భవనమే లేని అతిపెద్ద కమిషనరేట్
- సంవత్సరాలుగా ప్రహరీ నిర్మాణంతోనే సరి
- బడ్జెట్‌లో కేటాయింపుల్లేక సాగని పనులు



సాక్షి, సిటీబ్యూరో: విస్తీర్ణ పరంగా దేశంలోనే అతిపెద్ద పోలీస్ కమిషనరేట్ రాచకొండ. తాజాగా దీనికి రాష్ట్ర బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు జరగలేదు. గ్రేటర్‌లోని మూడు పోలీసు కమిషనరేట్లలో సొంత, శాశ్వత భవనం లేని కమిషనరేట్ కూడా రాచకొండే. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ కావడంతో కనీసం నూతన భవన నిర్మాణానికి ప్రత్యేక నిధుల కేటాయింపులు చేస్తారని ఉన్నతాధికారులు భావించారు. ఎప్పటిలాగే కొత్త ప్రభుత్వం కూడా రాచకొండకు ప్రత్యేక పద్దు కేటాయించకపోవడం గమనార్హం. శివార్లలో పెరుగుతున్న జనాభా, అభివృద్ధితో పాటు ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం దాదాపు ఎనిమిదేళ్ల క్రితం రాచకొండ పోలీసు కమిషనరేట్‌కు రూపమిచ్చింది. సైబరాబాద్‌తో పాటు మేడ్చల్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలను కలుపుతూ ఏర్పడిన ఈ కమిషనరేట్ పరిధి పరంగా దేశంలోనే అతిపెద్ద కమిషనరేట్‌గా అవతరించింది. కొన్నాళ్లు గచ్చిబౌలిలో ఉన్న సైబరాబాద్ కమిషనరేట్‌లో కొనసాగింది. ప్రస్తుతం నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి డీసీపీ కార్యాలయం రాచకొండ కమిషనరేట్‌గా మారింది. అనేక వివాదాల తర్వాత రాచకొండ పోలీసు కమిషనరేట్‌కు ప్రభుత్వం 86 ఎకరాలు కేటాయించింది. ఇందులో కమిషనరేట్‌కు శాశ్వత భవనం కోసం మేడిపల్లిలో 56 ఎకరాలు, యాదాద్రిలో ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) హెడ్ క్వార్టర్స్ కోసం 33 ఎకరాలు కేటాయించారు. ఇన్నేళ్లుగా కమిషనరేట్ భవన నిర్మాణానికి భూమి పూజ, ప్రహరీ నిర్మాణ పనులు మినహా అడుగు ముందుకు పడకపోవడమే విడ్డూరం.



సమావేశంలో పాల్గొన్న సునీతరావు తదితరులు

మహిళలకు అన్ని విధాలా సహకారం

- ఇచ్చిన మాట ప్రకారం హామీల అమలు
- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుందాం
- పార్టీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు

చేవెళ్ల: ప్రభుత్వం ప్రకటించిన అన్ని హామీలను అమలు చేస్తోందని.. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యత లేకుండాపోయిందని.. ఈ ప్రభుత్వంలో అన్ని విధాలా సహకారం ఉంటుందని చెప్పారు. మండలకేంద్రంలోని అట్లాస్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం చేవెళ్ల లోక్‌సభ స్థాయి మహిళా కాంగ్రెస్ సమావేశం ఆ విభాగం జిల్లా అధ్యక్షురాలు జయమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సునీతరావు మాట్లాడుతూ.. మహిళలంటే పేరుకు మాత్రమే కాదని .. అన్నిరంగాల్లోనూ ముందుంటారని నిరూపించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు రాజకీయాల్లో కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాణించాలని ఆకాంక్షించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకునేందుకు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో కమిటీలు వేసుకొని కలిసి పనిచేయాలని సూచించారు. సమావేశంలో వికారాబాద్ జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, జిల్లా ఉపాధ్యక్షురాలు పి.జ్యోతి, రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ నీలం పద్మ, బీ బ్లాక్ అధ్యక్షురాలు రమ్యశ్రీరెడ్డి, పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ తదితరులు పాల్గొన్నారు.

స్టోన్ క్రషర్లపై కొరడా

- ఎనిమిది కంకర మిల్లుల కూల్చివేత

సాక్షి, రంగారెడ్డిజిల్లా: నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్న స్టోన్ క్రషర్లపై మైనింగ్‌శాఖ చర్యలు చేపట్టింది. ఈ మేరకు శనివారం ఔటర్‌రింగ్‌రోడ్డు సమీపంలోని వట్టినాగులపల్లి, గోపన్‌పల్లితండా, కోకాపేటలో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న 8 స్టోన్ క్రషర్ల (కంకర మిల్లులు)ను జిల్లా మైనింగ్ శాఖ ఏడీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ వెంకటనర్సు సిబ్బందితో కలిసి జేసీబీల సాయంతో కూల్చి వేయించారు. మూడు గ్రామాల్లో కొనసాగిన 23 స్టోన్ క్రషర్లలో 15 క్రషర్లు స్వచ్ఛందంగా తొలగించుకోగా, మిగిలిన కంకర మిల్లుల యజమానులకు నోటీసులు పంపించినా భేఖాతరు చేయడంతో పూర్తిగా నేలమట్టం చేసినట్లు అధికారులు తెలిపారు. రాయల్టీ ఎగ్గొట్టడంతో పాటు కాలుష్యానికి కారణమైన ఈ స్టోన్ క్రషర్లపై 'కంకరమిల్లుల్లో కాసుల వేట', 'జిల్లాలో మైనింగ్ మాఫియా' వంటి శీర్షికలతో 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. ఈ కథనాలకు స్పందించిన అధికారులు ఇప్పటికే ఆయా యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. తొలగింపునకు నిరాకరించిన వాటిని కూల్చివేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలు తగవు

- అఖిలపక్షం నాయకులు



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అఖిలపక్షం నాయకులు అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రఘు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికులు, కర్షకులను ఇబ్బందులకు గురి చేసే విధంగా చట్టాలు చేస్తోందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేదలపై భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, సోషలిజం వంటి ప్రాథమిక సూత్రాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని.. ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని.. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించి, రైల్వే, రక్షణ, విద్యుత్ సహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల్లో కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేయాలని, ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతులకు యాభై శాతంతో కూడిన కనీస మద్దతు ధర ప్రకటించాలన్నారు. చిన్న, మధ్య తరగతి కుటుంబాలకు రుణభారం నుంచి విముక్తి కల్పించేలా రుణమాఫీ చేయాలని కోరారు. కార్మికులకు నెలకు రూ.26వేల ఇవ్వాలని, వారి భవిష్యత్తుకు పూర్తి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న దేశ వ్యాప్త కార్మిక సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పినబాక ప్రభాకర్, జగన్, జంగయ్య, శ్రీను నాయక్, మల్లేష్, శ్రీనివాస్, వెంకటయ్య, లలిత, జంగయ్య, బేరి శ్రీనివాస్, దశరథ్, రాజు, ఈశ్వర్ నాయక్, యాదయ్య, చందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు డిప్యూటీ మేయర్ గుడ్‌బై!

సాక్షి, సిటీబ్యూరో: కొంతమంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారా? ఈ అనుమానం ఆ పార్టీ నాయకులను వేధిస్తోంది. డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి సైతం పార్టీ మారొచ్చనే ఊహాగానాలు మరింత కలవర పెడుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పలువురు కార్పొరేటర్లను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించినట్లు తెలిసింది. పార్టీలో రాజకీయ భవిష్యత్తుపై హామీ కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేతో తనకు ప్రాణహాని ఉందని చెప్పినా..అధిష్టానం పట్టించుకోలేదంటూ ఇప్పటికే మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. ఈ నేపథ్యంలో సిట్టింగ్ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు సమాచారం. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతో నిర్వహించిన సమావేశానికి సైతం ఆమె డుమ్మా కొట్టారు. కాగా, బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకుడు మోతె శోభన్‌రెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ.. పార్టీ నేతల తీరు తనను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు.



క్లిక్.. వర్ధమాన సినీనటి శ్రీలీల ఫొటోగ్రాఫర్ అవతారమెత్తింది. శనివారం కూకట్‌పల్లి వివేకానంద నగర్ డివిజన్ ఏఎస్‌రాజు నగర్ కాలనీలోని సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఇలా కెమెరా పట్టుకుని క్లిక్‌మనిపించింది.

గ్రామీణ క్రీడాకారులకు తగిన గుర్తింపు

- చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- పార్లమెంట్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

చేవెళ్ల: గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభకు తగిన గుర్తింపు తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో శనివారం కొండా వెంకటరంగారెడ్డి, జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేవెళ్ల పార్లమెంట్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని గ్రామాల యువత కోసం ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రతిభ ఆధారంగా క్రీడాకారులను గుర్తించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆడేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఓట్ల కోసం ప్రభుత్వాలు స్వార్థ రాజకీయాలు చేస్తున్నాయన్నారు. మా తాత కొండ వెంకటరంగారెడ్డి ఆనాడు ఈ ప్రాంత అభివృద్ధి కోసం పోరాటం చేశారన్నారు. తొలి దశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన రంగారెడ్డిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ.. యువతను ప్రోత్సహించేందుకు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎప్పుడూ ముందుంటారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, రాందేవ్‌రెడ్డి, చేవెళ్ల కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు మధుసుదన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాములు, అనంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణాగౌడ్, వెంకట్‌రాంరెడ్డి, శర్వలింగం, మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, అశోక్, కుమార్‌గౌడ్, ఉమాశంకర్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నిర్వాహకులు, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వేటకు వెళ్లి యువకుడి మృతి

కొందుర్గు: చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పర్వతాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాశ నర్సింలు(32) శుక్రవారం సాయంత్రం చేపలు పట్టడానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం కూడా ఇంటికి రాకపోవడంతో గ్రామ శివారులోని చెరువులు, కుంటలు వెతికారు. శివారులోని మంజుల కుంట గట్టుపై బట్టలు, చెప్పులు కనిపించాయి. దీంతో స్థానికులు, పోలీసులు, రిస్క్యూ టీం వారు కుంటలో గాలించగా నీటిపై నర్సింలు మృతదేహం తేలింది. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఎస్సై కృష్ణయ్య తెలిపారు.

ఫోర్జరీ చేసి.. ప్లాట్లు విక్రయించి

- తప్పించుకు తిరుగుతున్న నిందితులు
- ఒకరి అరెస్టు రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: ఉద్యోగం చేస్తున్న సంస్థను మోసం చేశారు.. ఫోర్జరీ సంతకాలతో ప్లాట్లను విక్రయించారు.. ఐదేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని సాంకేతిక ఆధారాలతో చాకచక్యంగా అరెస్టు చేశారు. విచారణ అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. శనివారం పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ బంజారాహిల్స్, ఎమ్మెల్యే కాలనీలో నివాసం ఉంటున్న రోజారమణి, ఆమె కూతురు కావ్య మేరీ సువర్ణభూమి రిసార్ట్స్(ఎంఎస్ఆర్) హౌసింగ్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థకు రోజారమణి చైర్మన్‌గా, కావ్య మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అదే సంస్థలో మంచాల సాయిసుధాకర్ డైరెక్టర్‌గా, కల్యాణ చక్రవర్తి మేనేజర్‌గా పని చేస్తున్నారు. కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామశివారులో కొంత భూమిని తీసుకొని ప్లాట్లుగా చేసి మేరీ ఆ సంస్థ పేరిట అమ్ముతున్నారు.

సంస్థను మోసగించి

మేరీ సువర్ణభూమి రిసార్ట్స్(ఎంఎస్ఆర్) హౌసింగ్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పని చేస్తున్న డైరెక్టర్ మంచాల సాయిసుధాకర్ ఫోర్జరీ, ఛీటింగ్ చేసి కంపెనీకి చెందిన నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణల నేపథ్యంలో సంస్థకు రాజీనామా చేశారు. ఆయనకు సహకరించారని మేనేజర్ కల్యాణచక్రవర్తి, నరేందర్‌యాదవ్, పుల్లయ్యగుప్తాపై 2018లో కొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

రూ.2 కోట్లకు ఎసరు

నిందితులు మంచాలసాయిసుధాకర్, కల్యాణచక్రవర్తి సువర్ణభూమి రిసార్ట్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంతకాలను ఫోర్జరీ చేసి ప్లాట్లను విక్రయించారు. 2017లో నకిలీ సంతకాలతో సుమారు రూ.2 కోట్ల విలువచేసే 6 ప్లాట్లను షాద్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేశారు. నగరంలోని ఖైరతాబాద్‌కు చెందిన కృష్ణమోహన్‌కు విక్రయించడంతో విషయాన్ని తెలుసుకున్న రోజారమణి,కావ్య షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రిజిస్ట్రేషన్ పత్రాలను న్యాయస్థానం ఫోరెన్సిక్ ల్యాబ్ పంపగా సంతకాలు ఫోర్జరీ అయినట్టు నిర్ధారణ చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు 2021లో మంచాలసాయిసుధాకర్‌ను అరెస్టు చేశారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు.

ఐదేళ్లుగా పరారీలో

సైబరాబాద్ సీపీ అవినాశ్‌మహంతి ఆదేశానుసారం డీసీపీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో పట్టణ సీఐ ప్రతాప్‌లింగం ప్రత్యేక బృందంతో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఐదేళ్లుగా తప్పించుకొని తిరుగుతున్న నిందితులను పట్టుకునేందుకు దర్యాప్తును ముమ్మరం చేశారు. సాంకేతిక ఆధారాలతో నిందితులలోని కల్యాణచక్రవర్తిని ఈ నెల 9న విజయవాడలో అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం ఆయనని రిమాండ్‌కు తరలించారు. నిందితులపై బంజారాహిల్స్, సీసీఎస్ హైదరాబాద్, షాద్‌నగర్, కొత్తూరు, సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లలో 8 కేసులు నమోదైనట్లు తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. చక్రవర్తిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ ప్రతాప్‌లింగం, ఎస్ఐ శరత్‌కుమార్, ఏఎస్ఐ నర్సింహానాయక్, కరుణాకర్, యాదగిరి, మోహన్‌లాల్, నరేందర్, రఫీలను డీసీపీ నారాయణరెడ్డి అభినందించారు.

సమ్మెకు సహకరించాలని ప్రచారం

ప్రజాసంఘాల నాయకులు

కందుకూరు: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్, వ్యవసాయ, కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు అంకగళ్ల కుమార్ కోరారు. శనివారం మండల కేంద్రంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి పదవులు అనుభవిస్తూ, రాజ్యాంగాన్ని మార్చి మనువాద సిద్ధాంతాన్ని తెచ్చే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి పదేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌కు ధారాదత్తం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. పేద, మధ్య తరగతి ప్రజలపైన మోయలేని భారం మోపారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు శ్రీనివాస్, శేఖర్, సత్తయ్య పాల్గొన్నారు.